


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### What is the firist thing that comes in your mind?

**ఫేస్‌బుక్ తెరవగానే** 'నా గురించి మీరు ఏమనుకుంటున్నారూ? నా పేరు వినగానే మీ మనసులోకి ఏం వస్తోంది?' అని ఒకరు అడిగిన వెంటనే, వందల మంది మందలా అదే ప్రశ్న.

సుబ్బారావుగారూ మీ పేరు వినగానే నాకు జిగురు గుర్తుకు వస్తుందండీ.. అదీ ములగ చెట్టునుండి వచ్చే శ్రేష్టమైన 'గోందు' రెండు వేళ్ళతో పట్టుకుంటే వదలక ఎక్కడ పూయాలో తెలియక, మా సందానీగాడు హెడ్‌మాస్టర్‌గారి కుర్చీ మీద వుండలా చేసి పావేసాడు చిన్నప్పుడు. మా హెడ్‌మాస్టర్‌గారు చెక్స్ చెక్స్ కోటూ వేసుకుని, అది దగ్గరనుండి చూస్తే గోనెబట్ట చింపి కుట్టించినట్లుండేది. ఆ కోటుతో ఆ కుర్చీమీద కూర్చుంటే, దానికి అతుక్కుపోయి ఆ కోటు, ఆయన బలవంతంగా లేస్తే, అంతమేర కంతలా పడింది వెనకాల. అప్పట్లో ఇలా చిరుగుల బట్టలేసుకునే దిక్కుమాలినతనం ఫ్యాషన్ కాదుగా, అందరం కిసుక్కు కిసుక్కుమని నవ్వుతుంటే, ఆయనకి ఏం జరిగిందో అర్ధంకాలేదు.

సుబ్బారావుగారూ మిమ్మల్ని బాగా నవిలిన చిక్‌లెట్‌తో కూడా పోల్చవచ్చు.. అది మింగలేం, పబ్లిక్‌లో ఉమ్మలేం. అందుకని మా సందానీగాడు, ఆ నవిలిన చిక్లెట్ అసెంబ్లీ జరిగేటప్పుడు తన ముందున్న భూపతిగాడి నెత్తిమీద పెట్టి, గమ్మున వూరుకునేవాడు. మార్తప్రభూ టీచర్ కత్తెర తెచ్చి భూపతి జూట్టు కత్తిరించాల్సి వచ్చింది.

అంత బంక సుబ్బారావూ నువ్వు. ఎందుకంటే, మా ఇంటికి నన్ను కలిసి పలకరించి వెళ్తానని, నీ పెళ్ళాం నీ కూతురూ, అల్లుడూ, మనవడినీ పొద్దున్నే తీసుకొచ్చి బ్రేక్‌ఫాస్ట్, లంచ్, ఈవెనింగ్ కాఫీ స్నాక్స్, రాత్రి డిన్నర్ అయ్యాకగానీ వెళ్ళకపోతే, నేనే "ఇంక వెళ్ళిరండి చాలా ఆలశ్యం అవుతోంది, నాకు ఎర్లీ మార్నింగ్ షూటింగ్‌కి వెళ్ళాల్సిన పని ఉంది" అని చెప్పి ఒక రకంగా బయటకి పంపించాల్సి వచ్చింది. దీని వల్ల మా ఆయనకి నా అభిమానులని ఎవరైనా వస్తారంటే 'ఒద్దు బాబోయ్" అనే బాడ్ ఇంప్రెషన్ ఏర్పరిచావు. ఇది నాకు తీరని నష్టం కలిగించింది.

కుబేర లక్ష్మీ ... నా పేరు చెప్పగానే మీకేం గుర్తొస్తోంది అని అడిగావుగా అమ్మా? చెప్తా విను. డబ్బా గుర్తొస్తోంది. సొంత డబ్బా కొట్టుకుంటూ నీ మొగుడి రసికత గురించీ, నువ్వంటే ఆయనకున్న ప్రేమ గురించీ డప్పు వాయించుకుంటావే? అందులో నిజం చాలా తక్కువ. అందుకే ఈ ఎఫ్.బి వాల్ మీద నీ ఊహలకి రంగులద్ది ప్రదర్శిస్తున్నావు అనిపిస్తోంది.

"బావా..నాకు దెబ్బ తగిలితే నువ్వు ఏడుస్తావు.. నువ్వొస్తుంటే నీ తాలుకు పరిమళం నాకు తెలిసిపోతుంది" మనలో మనమాట లైఫ్‌బాయ్ రుద్దుకుని స్నానం చెయ్యమనమ్మా పాపం.

"బావా! ఏడేడు జన్మలకీ నీ దాన్నే కావాలని వుంది" (మరి ఆయన పక్కింటి ప్రసన్నలక్ష్మితో సినిమా హాల్లో కనిపించాడే) "నీకు నా అలక చెప్పకుండానే తెలిసిపోతుంటుంది" (అవును చంఢాలంగా చేసే నీ వంట ఆ రోజు ఇంకా చండాలంగా వుంటుంది ఏమో?)

ఇలా నీ ఎఫ్.బి వాల్ మీద చెప్పాలనిపిస్తుంది సొంత డబ్బా ఆపమని తల్లీ. కానీ చెప్పలేం.

ఇంక వెన్నెల వేణి (నీ అసలు పేరు మంగతాయారు అని మాకు తెలుసులే మీ ఆడబిడ్డ చెప్పింది)

"నేను రచయిత్రిని నా తవికలకి అవార్డు ఇవ్వని సమాజం లేదు. నేను మాటకారిని.. వంట గత్తెని.. అందగత్తెని. అబ్బా మొన్న ఒక పెద్ద మనిషి, ఇన్ని పనులు ఎలా చేస్తావో అని వెనక్కి విరుచుకు పడిపోయాడు. పైగా నాకు టెక్కు అంటారందరూ. ఈ మాత్రం వుండద్దా? ఇన్ని అర్హతలున్నప్పుడూ? అని నీ కిటికీల జాకెట్టులోంచి వీపుని చూపిస్తూ ఇచ్చిన బ్యాక్ సైడ్ ఫోటో, ప్రొఫైల్ పిక్‌గా పెట్టినప్పుడే.. నీ మొహం చూపిస్తే మేం మా అభిప్రాయాల్ని వెళ్ళగక్కేస్తామేమో... అన్న నీ అభిప్రాయం మాకు అర్ధమైంది. ఏం చేస్తాం? ఎఫ్.బిలో నీ తవికలు చదివి అర్థాయిష్షు వెధవొకడు ఆ మధ్య ఆస్పత్రి పాలయ్యాడని, నీ పేరు చెప్పగానే గుర్తొస్తుంది.

అయినా అలా మొహం మీద చెప్పలేం. నువ్వు ఎఫ్.బి వంటల గ్రూప్‌లో ఫోటో పెట్టిన పచ్చడి దురదృష్టవంతురాలు మీ పనిమనిషి తిని, వాంతులూ, విరేచనాలతో మంచం పట్టిందట. ఆ పనిమనిషి మంచం పట్టేసరికి, మీ పక్కింటావిడ, కూతురు పెళ్ళి సమయంలో నిన్ను వెయ్యి తిట్టుకుంటూ, వేరే పనిమనిషిని వెతుక్కోవలసి వచ్చిందట. ఆ విషయం గుర్తొస్తుంది నీ వంటల పోస్ట్‌లు చూస్తే.

చిత్రాల చిత్తరా.. నిన్ను తలుచుకోగానే మా చిన్నప్పుడు సందానీగాడు చిత్రని చిత్తరా...కత్తెరా...పరీక్షలొస్తే నువ్వు బిత్తెరా అని పాడడం గుర్తొస్తుంది. అసలు నీ గొంతు విని, మీ ఇంటి ఓనర్ "ఆ....ఆ...వస్తున్నా అబ్బీ రాత్రి అన్నం మిగిలిపోయింది, ఒక బిచ్చగాడైనా వస్తే బావుండ్ను అనుకున్నా. నువ్వొచ్చావు" అని వచ్చి, నువ్వు "మల్లెపందిరి నీడలోనా జాబిల్లీ...మంచం వేసి వుంచినాను రావోయీ" అని పాడ్తున్నావని తెలిసి బిత్తరపోయిందని, పాపం ఆవిడే చెప్పింది. మీ ఆయన ఆ మధ్య విడాకుల కోసం లాయర్‌ని కలిస్తే, ఆ లాయర్ నీ చేత పాటలు ఆయన ఇంట్లో వున్న సమయంలో పాడను అని నీ చేత బాండ్ పేపర్ మీద రాయించి, మిమ్మల్ని కలిపి వుంచాడని వినికిడి.

మేం అంటే ఇంత అలుసా చిత్తరా? ఇలా సెన్సార్ కత్తెర లేని పాటలు పాడి ఎఫ్.బిలో పెట్టేస్తుంటావు? సడెన్‌గా అవి వచ్చేస్తుంటే ఆ ధ్వని ఏమిటో అర్థంగాక నేను కంగారు పడ్తుంటే, "రోడ్డుమీద పాపం కారుకింద కుక్కపిల్ల పడినట్లు వుందే" అని మా ఆయన అరుస్తారు.. అది ఫలానా ఎఫ్.బి చిత్ర పాటండీ.. అని చెపితే "ఆ పేరు మార్చుకోమను. గానకోకిల చిత్రమ్మ వింటే బాధపడగలదు.. బాబోయ్ అపస్వరాలు కాదు అసలు స్వరమా? అని చెవులు మూసుకుని ఆయన బాధపడ్డారు. ఇలా ఎఫ్.బి స్టోరీల్లో, రీల్స్‌లో సడెన్‌గా నీ పాటలు పెట్టకమ్మా. కావలంటే కసితీరేదాకా వాతలు పెట్టు, అవికూడా నయమే నీ పాటలకన్నా అని చెప్పాలనుంది.

అయ్యో సుందరమ్మో! అరవై ఏళ్ళుపై బడి నీ రీల్స్ "ఊ అంటావా! నువ్వే ఉ..ఊ అంటావా?" అని పెడ్తుంటే చచ్చిపోవాలనిపిస్తుంది. నిజంగా నీకు ఎవరూ చెప్పకుండా ఆసం...ఈసం.. అని కామెంట్స్ పెడ్తారేకానీ నీ ఊపుడూ, నీ డాన్స్‌కి మా కుక్కపిల్ల దడుసుకుని సెల్ ఫోన్ కనిపిస్తే చాలు భయంతో అరిచేస్తోంది. నోట కరుచుకుని మేడమీంచి కింద పడెయ్యాలని కూడా చూస్తోంది.

జాంబీలని మేం నిజ జీవితంలో చూడలేదు. కానీ అవి నిజంగా వుండి వుంటే ఆ జాంబీలన్నీ జాంబిరెడ్డిలా ఇలాగే వూగుతూ డాన్స్ ఆడివుండేవి. కనీసం ఆ డాన్స్‌లప్పుడు నీ మేకప్ అన్నా తగ్గించమ్మా. (అసలు అదంతా మేకప్పేనా? మైదాపిండా? రాంగోపాల్ వర్మ సినిమాలోలా?) ఇలా నీ పేరు తలచుకోగానే 'నీ పేరు తలచినా చాలు... ఎదలో కోటి శతకోటి.. భయంకర తరంగాలు' అని చెప్పాలనిపిస్తోందమ్మా.

సమాజోద్ధారక భవతారిణీరావ్.. తల్లో నువ్వు సమాజ సేవలో ఇరవై నాలుగ్గంటలూ శ్రమిస్తున్నావని నీకు సమాజోద్ధారక భవతారిణి అని బిరుదు ఇచ్చారని చెప్పుకుంటూ, ఓల్డ్ ఏజ్ హోమ్స్ లో ముసలి వాళ్ళకి ప్రేమగా వడ్డిస్తూ, వాళ్ళ బుగ్గలు పుణుకుతూ, గోళ్ళు తీస్తూ ఫోటోలు ఎఫ్.బి నిండా పెడ్తున్నావ్. కానీ ఇంట్లో అత్తగారిని గదిలో పెట్టిబంధించి, రెండు రోజులకోసారి పనిమనిసి చేత కిటికీలోంచి రెండు రొట్టెముక్కలు వేయిస్తావని, ఆ పనిమనిషే మా అందరితో చెప్పి "ఛీఛీ ఆ ముసలావిడ ఉసురు ఈమెకి తగలకపోదు. పట్టు చీరలు కట్టుకుని, బయట అనాధాశ్రమాల్లో ఈ సేవలు చేస్తున్న ఫోటోలెందుకు? పెనిమిటిని కన్న తల్లికి ఓ ముద్ద రోజూ విస్తరిలో పెట్టనీయదు.. ఆ మహానుభావుడు నోరు ఎత్తితే కొట్టుద్ది. ఇసుంటోళ్ళకి పెద్ద పెద్ద బిరుదిలిచ్చేటోళ్ళని అనాల.. వాళ్ళ నోట్లో మన్నుపడ" అని ఆ పనిమనిషి నీ ఖ్యాతి నోరారా పొగుడ్తుంటుంది. ఇదేనా తల్లీ సమాజ సేవ? పిల్లల్ని కూడా పట్టించుకోకపోతే వాళ్ళు దేశాలు పట్టిపోయారుట కదా పాపం.

"ముందు ఇంట్లో వాళ్ళని మనుషుల్లా చూడమ్మా, తర్వాత దేశాన్ని ఉద్ధరించచ్చు" అని చెప్పాలనిపించింది.

నా పేరు వినగానే మీకేం గుర్తొస్తుంది అని ఎఫ్.బిలో నువ్వు అడిగినప్పుడు మీరంతా టైం ఎక్కువయి కష్టపడకపోయినా తిండి మూడుపూటలా ప్లేట్‌లోకి రావడంవల్ల ఐడెంటిటీ క్రైసిస్‌తో కొట్టుకుపోతూ బాధపడ్తున్నారనీ, ఈ బాధని "గుర్తింపు గుల్మం" అంటారనీ, దీంట్లో స్పెషలైజ్ చేసిన ఓ ఫారెన్ డాక్టర్‌గారు చెప్పారు. ఈ వ్యాధి కోసం స్పెషల్

వార్డ్స్ కూడా హాస్పిటల్స్‌లో కట్టిస్తున్నారంట.. మరి ఇదీ మనసులో వున్నమాట. 'మనసున వున్నదీ... చెప్పాలనున్నదీ.. మాటలు రావేలనో'.. సర్వేజనా సుఖినోభవంతూ!

Post your comments







